క్లుప్తంగా

చిన్నారులు మనోధైర్యంతో మెలగాలి



రౌతులపూడిలోని ఫిజియోథెరపీ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ

రౌతులపూడి: పుట్టుకతో దివ్యాంగులైన చిన్నారులంతా ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా మనోధైర్యంతో మెలగాలని ఎంఈఓ-1 సతీష్ బాబు అన్నారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు స్థానిక భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, వారి తల్లితండ్రులకు పలు సూచనలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులకు ఎన్నో రాయితీలు కల్పిస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని తోటి విద్యార్థులతో సమానంగా ఆటపాటలతో పాటు, మంచి విద్యను ఆస్వాదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 గాడి కొండ బాబు, ఫిజియోథెరపిస్టు కోటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలు పాటించాలి



రాఘవపట్నం గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్టాకును పరిశీలిస్తున్న ఎంఈఓ సతీష్‌బాబు

రౌతులపూడి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులంతా ప్రభుత్వం నిర్దేశించిన విద్యాప్రమాణాలను పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఎంఈఓ-1 కె.సతీష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీఎస్టీ-2 పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ-2తో కలిగే ఉపయోగాలు, ఆవశ్యకతపై విద్యార్థులను చైతన్య పరిచారు. అనంతరం మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలోని మాతయ్యపేట, ముకులూరు, గిరిజన పాఠశాలలను, రాఘవపట్నం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2గాడి కొండబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేలతో పెరిగిన పనిభారం

జగ్గంపేట: సర్వేల పేరుతో పనిచేయని ఫోన్లతో పనిభారం పెంచుతున్నారని, సమయానికి నిర్ణీత పనిపూర్తి చేయలేదని జీతంలో కోత విధిస్తున్నారని మంగళవారం జగ్గంపేట మండలం రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఆశా వర్కర్ల నాయకులు సి.హెచ్ మంగ, ఇ.చిలకమ్మ ఆధ్వర్యంలో తాము పడుతున్న బాధను అర్థం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటింటా త్రైతభగవద్గీత ప్రచారం



రేఖవానిపాలెంలో భగవద్గీత ప్రచారం చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

తుని రూరల్: రేఖవానిపాలెం గ్రామంలో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచారం చేశారు. మంగళవారం జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరణే భగవద్గీతలో ముఖ్యమైన జ్ఞానం అన్నారు. దసరా పండగ అంతరార్థం వివరించారు. సేవా సమితి ఉపాధ్యక్షుడు శాంతరాజు, సభ్యులు సత్యవతి, నందన, స్వాతి, సర్వజిత్, నాయుడు, వ్యాస్, జలంధర్ పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి



బిళ్లకుర్తి వెంకటేష్

కిర్లంపూడి: ఆర్థిక సమస్యలతో గడ్డి మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటనపై మంగళవారం కిర్లంపూడి పోలీస్ స్టేషనలో కేసు నమోదు అయినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. జగపతి నగరం పెట్రోల్ బంక్ వెనుక నివాసం ఉంటున్న బిళ్లకుర్తి వెంకటేష్ (37) పీజీ చదివి పలు ఉద్యోగ ప్రయత్నాలు చేసిన ఫలించకపోవడంతో కంప్యూటర్ హార్డ్ వేర్ నేర్చుకుని సామర్లకోట, ప్రత్తిపాడులో దుకాణాలు పెట్టి రాణించలేక అప్పులు పెరిగాయి. దీంతో గత శనివారం గడ్డి మందు తాగడంతో కుటుంబ సభ్యులు కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు చిన్న తండ్రి సత్యన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అండగా ఈ-పంట

- రైతులకు బహుళ ప్రయోజనాలు
- అక్టోబర్ 25 వరకు గడువు
- 92.6 శాతం నమోదు

తుని రూరల్: ఆరుగాలం కష్టపడి పంటను సాగు చేసిన సాగుదారులకు ఈ- పంట నమోదు బహుళ ప్రయోజనాలను అందిస్తుంది. డెల్టా ప్రాంతంలో ఇప్పటికే ఖరీఫ్ కోతలు ప్రారంభం కాగా మెట్ట ప్రాంతంలో ఇటీవలే వరినాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికీ ఈ- పంట, ఈ కేవైసీపై సరైన అవగాహన లేక దీంతో ఈ పంట నమోదు ఆలస్యమవుతుంది. ఈ కారణంగానే విపత్తులతో పంట నష్టం వాటిల్లినా బీమా, ప్రభుత్వం సాయానికి దూరమవుతున్నారు. వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 48,255 మంది రైతులు ఉండగా 76,871 ఎకరాల భూములు ఉన్నాయి. ఈప్పటి వరకు 71,235 (92.6 శాతం) ఎకరాల్లో ఈ- పంట నమోదు పూర్తయ్యింది. ఇంకా 5,636 ఎకరాల్లో పంటలను నమోదు చేయాల్సి ఉంది. పంట నమోదైన భూముల్లో వాస్తవంగా ఏ పంట సాగవుతుందోనని పరిశీలించాలన్న ఉన్నత అధికారుల ఆదేశాలతో ఏఓలు క్షేత్రస్థాయి తనిఖీలు చేస్తున్నారు.



రాపాకలో తనిఖీ చేస్తున్న ఏఓ అశోక్ కుమార్



కొలిమేరులో పంట నమోదు చేస్తున్న వీఏఏ

బహుళ ప్రయోజనం

ఈ-పంట నమోదుతో సాగుదారులకు బహుళ ప్రయోజనం లభిస్తుంది. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ పంట నమోదు చేసుకున్న రైతులందరికి ఉచిత పంట బీమా అమలు చేసింది. చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియంను చెల్లించక పోవడంతో రైతులే బీమా మొత్తాన్ని కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. పంట రుణాలు తీసుకునే సమయంలో సాగుదారుల అనుమతితో రుణ మొత్తం నుంచి ప్రీమియంను మినహాయించారు. ఈ పంట నమోదుతో పండించిన పంటను గిట్టుబాటు ధరకు విక్రయించుకునే అవకాశం ఉంది. అలాగే అతివృష్టి, అనావృష్టి, తుపాన్లు, వరదలతో పంటలకు నష్టం వాటిల్లితే బీమా వర్తిస్తుంది. ఇలా ఈ పంట నమోదుతో సాగుదారులు బహుళ ప్రయోజనం పొందవచ్చు.

25తో ముగియనున్న గడువు

ఖరీఫ్ సీజన్‌లో అన్నిరకాల భూముల్లో సాగవుతున్న పంటలకు ఈ- పంట నమోదు తప్పనిసరి. సీజనల్‌గా సాగయ్యే వరి, పత్తి, ఇతరేతర వ్యవసాయ పంటలు ఎప్పటికప్పుడు ఈ పంట నమోదు పూర్తి చేస్తుంగా ఉద్యాన, సెరికల్చర్, ఆక్వాకల్చర్, ఇతరేతర ధీర్ఘకాల పంటలకు ఈ పంట నమోదు కొనసాగుతుంది. ఈనెల 25వరకు గడువుండడంతో ఆయా విభాగాల అధికారులు ఈ పంట నమోదుపై క్షేత్రస్థాయి సిబ్బందిని వేగవంతం చేస్తున్నారు.

నమోదు తప్పనిసరి



ఈ- పంట నమోదుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, పంట నష్టం వాటిల్లితే బీమా వర్తింపు, ఇన్‌పుడ్ సబ్సిడీలు లభిస్తాయి. పంట రుణాలకు, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు విక్రయానికి, గిట్టుబాటు ధర పొందేందుకు ఈ పంట నమోదు, ఈకేవైసీ ప్రక్రియ తప్పనిసరిగా చేయించుకోవాలి. వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఏలు, వీఆర్‌ఓలు ఒకపక్క ఈ పంట నమోదు చేస్తూనే మరోపక్క ఈకేవైసీ చేస్తున్నారు. ఈనెల 25తో ఈ పంట నమోదు ప్రక్రియ ముగుస్తుంది.

– బి.అశోక్ కుమార్, ఏఓ, తుని మండలం

సబ్‌డివిజన్‌లో ఈ పంట నమోదు వివరాలు ..

మండలం	రైతుల సంఖ్య	విస్తీర్ణం ఎకరాల్లో	పంట నమోదు	శాతం
తుని	14,387	20,408	19,253	94
కోటనందూరు	8,284	13,419	12,808	95
రౌతులపూడి	8,636	14,419	12,049	84
తొండంగి	11,037	17,347	16,417	95
శంఖవరం	5,908	11,278	10,708	95
మొత్తం	48,255	76,871	71,235	92.6

ఈ- పంట నమోదు ఎలా..

గ్రామాల్లోని రైతులు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలతో పాటు భూముల సమాచారాన్ని నమోదు చేసుకోవాలి. సాగు చేస్తున్న పంటలు, భూములకు సంబంధించిన ఫొటోలతో పాటు రైతు వేలిముద్రలు నమోదు చేసుకోవాలి. ఈ-పంట నమోదుతో పాటు ఈ కేవైసీ నమోదు చేయించుకోకుంటే ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేరు.

స్పార్క్ ఫౌండేషన్‌కు జాతీయ పురస్కారం



స్పార్క్ సీఈఓ సాయిప్రదీప్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న కేంద్రమంత్రి భూపేంద్రయాదవ్

ఏలేశ్వరం: భౌగోళిక అంశాలపై వివిధ ప్రయోగాలు చేస్తున్న పట్టణానికి చెందిన స్పార్క్ ఫౌండేషన్ మంగళవారం జాతీయ పురస్కారం అందుకుంది. డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం పర్యావరణ, అరణ్య, వాతావరణ మార్పులపై జాతీయస్థాయి హ్యాక్‌థాన్‌లో స్పార్క్ ఫౌండేషన్ ప్రశంసాపత్రాన్ని దక్కించుకుంది. దీనికి దేశవ్యాప్తంగా ఏడు జట్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ నుంచి స్పార్స్ ఫౌండేషన్ విజేతగా నిలిచింది. దీంతో కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ చేతులమీదుగా స్పార్క్ ఫౌండేషన్ సీఈఓ సాయిప్రదీప్, ప్రాజెక్టు డైరక్టర్ సూర్యరమ్యశ్రీ ప్రశంసాపత్రం అందుకున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

జగ్గంపేట: మండలంలోని నరేంద్రపట్నం, జగ్గంపేట ఇండస్ట్రీయిల్ ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కారణంగా 8వ తేది బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జగ్గంపేట విద్యుత్ డిఇ వీరభద్రరావు తెలిపారు. ఈ కారణంగా భావవరం, కాండ్రేగుల, గ్రామాలతో పాటు గొల్లలగుంట, గుర్రంపాలెం గ్రామాల్లోని బోర్లుకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సిబ్బందికి సహకరించాలని కోరారు.

అండగా ఉండేందుకే డిజిటల్ బుక్



ఏలేశ్వరంలో డిజిటల్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఏలేశ్వరం: కార్యకర్తలకు అండగా ఉండేందుకే మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ప్రారంభించారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో మంగళవారం అర్బన్ పరిధిలో డిజిటల్ బుక్ ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ మొదలుపెట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను వేధించడం, దాడులు చేయడమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎటువంటి ఇబ్బందులకు గురి చేసినా డిజిటల్ బుక్‌లో నమోదుచేయాలన్నారు. అధికారంలోకి రాగానే బుక్‌లో నమోదైన వ్యక్తులపై విచారణ జరిపి కఠినంగా శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడప్రసాద్, వాగు బలరామ్, పేకల జాన్, జువ్వన వీర్రాజు, గోళ్ల నాగేశ్వరరావు, పైల అబ్బు, చంద్రమౌళి, నోమ్ముమధు తదితరులు పాల్గొన్నారు.

అస్సాగో పరిశ్రమకు స్వచ్ఛ ఆంధ్ర పురస్కారం



అస్సాగో ప్రతినిధులకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి పంచాయతీ పరిధిలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమకు స్వచ్ఛ ఆంధ్ర పురస్కారం లభించింది. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, సామాజిక బాధ్యతతో కూడిన కార్యకలాపాల్లో విశేష కృషి చేసినందుకు ఈ పురస్కారం దక్కింది. పురస్కారాన్ని మంగళవారం కలెక్టర్ కీర్తి చేకూరి తదితరుల చేతుల మీదుగా సిబ్బంది అందుకున్నారు. పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వివేక్ కుమార్‌శుక్లా మాట్లాడుతూ యేడాది కాలంగా చేపట్టిన సామాజిక కార్యక్రమాలకు ఈ పురస్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు.

వైఎస్సార్ సీపీకి దళితులే వెన్నెముక



గిరిబాబును సాల్వాతో సత్కరిస్తున్న దళిత మహిళలు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీకి వెన్నెముకలా నిలుస్తున్న దళితులకు ఎల్లప్పుడు పార్టీలో సముచిత స్థానం ఉటుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు అన్నారు. శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన దళిత నాయకులు మంగళవారం కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. దళిత మహిళలు గిరిబాబును సాల్వా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై రోజురోజుకు దాడులు పెరుగుపోతున్నాయని, త్వరలోనే ఆ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దళితులకు రక్షణగా వైఎస్సార్ సీపీ పని చేస్తుందని ధైర్యంగా ఉండాలన్నారు. పార్టీ విజయానికి శక్తి వంచనలేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురి దళిత నాయకులను పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోటడ రాజు, తిరగటి సతీష్‌బాబు, మడికి ప్రకాష్‌రావు, ఎద్దు కామయ్యమ్మ, జెర్రి రాజేష్ తదితరులు ఉన్నారు.

న్యాయ వ్యవస్థపై దాడులను అరికట్టాలి



ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి గోపీనాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్ గవాయిపై దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్తిపాడు కోర్టు న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు మాట్లాడుతూ దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిపైనే ఇటువంటి దాడి జరగడం విచారకరమని, ఈ దాడి భారత న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థను అస్థిర పరచే ఇటువంటి దుర్మార్గపు కుట్రల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ, బార్ ప్రతినిధులు సోము గౌరీశంకర్, పలివెల నాగేంద్రరాజు, చిట్టంశెట్టి పుల్లయ్య, ఆకాశపు మల్లేశ్వరరావు, బొంగుకూరి మధుబాబు, శివ కుమార్, అచ్యుతరామారావు, కందా వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల పరిస్థితి ఏమిటి..?

గోకవరం: దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయిపై జరిగిన దాడి యత్నంపై నిరసిస్తూ గోకవరంలో మంగళవారం దళిత సంఘాలు ఆందోళన చేపట్టాయి. దీనిలో భాగంగా ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై కోర్టు ప్రాంగణంలోనే షూ విసిరి దాడికి యత్నం చేయడం సిగ్గుచేటన్నారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ పైనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయంటే, సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఈ దుశ్చర్యకు కారణం కేవలం కుల దురహంకారమేనన్నారు. తక్షణమే దాడికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వాల్మీకి ఆశయాలు అనుసరిద్దాం



వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

జగ్గంపేట: మండల కేంద్రం జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజిలో శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, వైస్ ప్రిన్సిపాల్ మదీనా పద్యరూపంలో వాల్మీకి త్యాగాలను, అవిరళ కృషిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



కిర్లంపూడి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

కిర్లంపూడి: చిరు ఉద్యోగులమైన ఆశ వర్కర్లపై అధిక పనిభారం తగ్గించాలని ఆశ వర్కర్లు మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల ఆశా వర్కర్ల యూనియన్ ప్రెసిడెంట్ బి.రమణమ్మ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశా వర్కర్లుగా మార్పు చేసి, అన్ని రకాల సెలవులు ప్రకటించాలి, టీఏ, డీఏలు, ఇవ్వాలి, ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పొందిన ఆశాలకు ప్రభుత్వమే స్వయంగా పర్మినెంట్ పోస్టులు భర్తీ చేయాలి, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల నియామకం చేపట్టాలి, ఆశాలపై అధిక పనిభారం మోపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్‌కు అందజేశారు. న్యాయపరమైన డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చకపోతే వచ్చే ఆశా డే రోజును రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

పంట నమోదు తప్పనిసరి

జగ్గంపేట: రైతులు పంట నమోదు తప్పనసరిగా చేయించుకోవాలని జగ్గంపేట వ్యవసాయ శాఖ ఎడి గరిమెళ్ల శ్రీనివాస్ అన్నారు. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ఆయన మంగళవారం పర్యటించి పంటనమోదు ప్రాముఖ్యతను రైతులకు వివరించడంతో పాటు,వ్యవసాయ సిబ్బందికి కూడా అవగాహన కా ర్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి అనావృష్టి లాంటి పరిస్థితులు సంభవించినపుడు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందడంలో ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరులో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 28న జగ్గంపేటలో నిర్వహించనున్న పార్టీ 11వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కడపలో డిసెంబర్ 6, 7 తేదీల్లో నిర్వహించే పార్టీ 9వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గ్రామంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి ఆంజనేయస్వామి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, పార్టీ నాయకులు నాగేశ్వరరావు, బోడపాటి సుదర్శన అప్పారావు, పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఒత్తిడితోనే కేసులు



స్టేషన్‌లో బెయిల్‌కు దరఖాస్తు చేస్తున్న లాలం బాబ్జీ

కోటనందూరు: అధికార పార్టీ నాయకులకు పోలీసులు తొత్తులుగా మారుతున్నారని కోటనందూరు మండల వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి లాలం బాబ్జీ ఆరోపించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామస్తులతో కలిసి పోలీసు స్టేషన్లో బెయిల్ మంజూరుకు దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో దుర్గాపరమేశ్వరీ అమ్మవారి శరన్నవరాత్ర ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి ఆరోపణలు గాని, అవాంఛనీయ సంఘటనలు కాని జరగకపోయినా కార్యక్రమమంతా పూర్తయిపోయిన అనంతరం అర్ధరాత్రి వేళ అశ్లీల నృత్యాలు ప్రదర్శించారంటూ పోలీసులు ఫేక్ వీడియోతో ఆలయ ధర్మకర్తగా ఉన్న తనతో పాటు రెండు సౌండ్‌బాక్స్‌ల వాహనాలు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశారన్నారు. అనేక గ్రామాల్లో టీడీపీ నేతలు సాంస్కృతిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాల ఏర్పాటు చేసినా.. పట్టించుకోని పోలీసులు వైఎస్సార్ సీపీ నేతలపై మాత్రం చకచకా కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు అధికార నేతల ఒత్తిళ్లకు లొంగకుండా చట్టబద్ధంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ సీపీ నేతలు చింతకాయల చినబాబు, లగుడు శ్రీనివాసు, గొర్లి రామచంద్రరావు, రుత్తల జోగిరాజు, వేముల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో ఆర్ఎస్ఎస్ భాగస్వామ్యం

గోకవరం: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను మంగళవారం మండలంలోని రంపయర్రంపాలెంలో నిర్వహించారు. గ్రామంలో గ్రామ దేవత సోమాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న భారత వికాస పరిషత్ దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల పురుషోత్తమశాస్త్రి మాట్లాడుతూ 1925 విజయదశమి రోజున నాగపూర్‌లో డాక్టర్ హెగ్డేవార్ గురూజీ కేవలం 13 మంది సభ్యులతో ప్రారంభించిన ఆర్ఎస్ఎస్ అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నేడు దేశవ్యాప్తంగా వేలాది శాఖలు, లక్షలాదిమంది స్వయం సేవకులతో దేశ ప్రగతిలో భాగస్వామ్యమైందన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు





ఎస్.తిమ్మాపురంలో చెత్తకుప్పను తొలగించిన సిబ్బంది

కిర్లంపూడి: మండలంలోని ఎస్.తిమ్మాపురంలో రోడ్డు పక్కన చెత్తపోగు పెరుగుపోయి దోమలకు అవాసంగా మారడంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. దీనిపై గత సోమవారం 'పల్లెతో చెత్తపట్టాల్' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్ స్పందించారు. ఎస్.తిమ్మాపురంలోని పేరుకుపోయిన చెత్తకుప్పను తొలగించాలని పంచాయతీ సెక్రటరీకు ఆదేశాలు జారీ చేశారు. శానిటేషన్ సిబ్బంది మంగళవారం చెత్తపోగును తొలగించి బ్లీచింగ్ చల్లారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గాదేవికి పంచామృత అభిషేకాలు

ఏలేశ్వరం: అశ్వీజ పౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం దుర్గాదేవి అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్థానిక లింగంపర్తి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకుడు ముత్యంజయశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించారు.

వైభవంగా ఆశ్వయుజ పౌర్ణమి అభిషేకం

గండేపల్లి: తాళ్లూరులో చండీ నవార్ణ దుర్గాదేవికి ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి కుంకుమ పూజలు చేపట్టారు. ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం సందర్భంగా అభిషేకాలు నిర్వహించినట్టు అర్చకులు మూర్తి వెల్లడించారు. పక్కనే వెలసియున్న లలితాదేవి ఆలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. వాల్మీకి జయంతి సందర్భంగా మండలంలోని పలు దేవాలయాల్లో రామాయణం విశిష్టతను వివరించి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు.

అరుణాచలక్షేత్రంలో పౌర్ణమి పూజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపీత కుచాంబ సమేత అరుణాచల క్షేత్రంలో మంగళవారం పౌర్ణమి పూజలను వైభవంగా నిర్వహించారు. అపీత కుచాంబ అమ్మవారిని బాల త్రిపుర సుందరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి అమ్మవార్లకు పండితులు కుంకుమ పూజలు, అభిషేకాలు, అర్చనలు వంటి ప్రత్యేక ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెం పంచాయతీ శివారు సగరు పేటలో ఉన్న మోడల్ ప్రైమరీ స్కూల్ అభివృద్ధికి గ్రామానికి చెందిన రిటైర్డు డిప్యూటీ పేరా మెడికల్ ఆఫీసర్ పడాల వీర వెంకట సత్యనారాయణ రూ.50 వేలు విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిబాబుకు మంగళవారం అందజేశారు. సత్యనారాయణను గ్రామస్తులు అభినందించారు. యూటీఎఫ్ నేత పివి మాస్టార్, ఉపాధ్యాయులు రామ్మూర్తి, దుర్గాభవానీ, శిల్ప విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వరద



లోవ మెట్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

తుని రూరల్: మండలంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. గంటకుపైగా కురిసిన భారీ వర్షంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానం ప్రాంగణాలను ముంచెత్తింది. మెట్ల మార్గం నుంచి ఉప్పొంగిన వరదనీరు కైలాస గణపతి, మహామండపాలు, ఇటీవల నూతనంగా నిర్మించిన మహాగోపురం, మెట్ల మార్గాలను ముంచెత్తింది. ఆ సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు లేకపోవడం, అమ్మవారి ప్రధాన గర్భాలయంలోకి నీరు చేరకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వరదనీటితో పాటు రాళ్లు, మట్టి కొట్టుకురావడంతో ప్రాంగణాలన్నీ అపరిశుభ్రంగా దర్శనమిచ్చాయి. బుధవారం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ దేవస్థానం ప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తామని అధికారులు తెలిపారు. తుని పట్టణంలో కొండవారపేట రైల్వే తూము, ఎల్ఐసీ ఆఫీస్ వద్ద రైల్వే తూములు వరదనీటితో నిండిపోయాయి. పట్టణ, గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

వామ్మో..పాము

ప్రత్తిపాడు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుకు గురయ్యారు. గజ్జనపూడి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బి.వీరబాబు (45) గొర్రెలను తొలుకొని వస్తుండగా మంగళవారం సాయంత్రం పాము కాటు వేసింది. మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన రైతు పంది లక్ష్మణరావు (48) సాయంత్రం పొలం పనులు ముగించుకుని, ఇంటికి తిరిగి వస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. మండలంలోని శరభవరం గ్రామానికి చెందిన గొనగాల నరసింహమూర్తి రాత్రి తన ఇంటిలో కుట్టు మిషన్ కింద శుభ్రం చేస్తుండగా విషసర్పం కాటు వేసింది. వీరిని బంధువులు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు హుటాహుటీన తరలించారు. ఏలేశ్వరం మండలం ఎర్రవరానికి చెందిన బీ వీరబాబు(20) కట్లపాము కాటు వేయడంతో సీహెచ్‌సీ వైద్య సిబ్బంది యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు ఇచ్చి, సపర్యలు చేశారు. నలుగురు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు.